హోంగార్డుకు క్యాష్ అవార్డు

ఏసీబీ డీజీ నుంచి అవార్డు అందుకుంటున్న ఉపేందర్

కూసుమంచి, మే 30: ఖమ్మం ఏసీబీ కార్యాలయంలో హోంగార్డుగా పనిచేస్తున్న కూసుమంచికి చెందిన ఆళ్లగడప ఉపేందర్‌కు ఏసీబీ డీజీ సీవీ ఆనంద్ నుంచి రూ.2వేలు క్యాష్ అవార్డు అందింది. ఉపేందర్ పనితీరుకు గుర్తింపుగా ఈ అవార్డును డీజీ అందజేశారు.

'ఇన్ఫోసిస్'ను సందర్శించిన ఇంజినీరింగ్ విద్యార్థులు

ఇన్ఫోసిస్ కంపెనీ ఎదుట విద్యార్థులు

ఖమ్మం రూరల్, మే 30: మండలంలోని శ్రీచైతన్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీస్ అండ్ రీసెర్చ్ కళాశాల సీఎస్ఈ, ఏఐఎంఎల్ మూడో సంవత్సరం విద్యార్థులు 60 మంది గురువారం హైదరాబాద్‌లోని ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ ఇన్ఫోసిస్‌ను సందర్శించారు. వివిధ అంశాలను వారికి ఆపరేషన్స్ హెడ్ శ్రీనివాస్ వివరించారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, ఇంటర్నేషనల్ ఆఫ్ థింగ్స్ తదితర అంశాలపై ఇంజినీరింగ్ విద్యార్థులకు అవగాహన ఉండాలన్నారు.

టీసీఎస్ జాతీయస్థాయి పరీక్షలో ఎస్‌బీఐటీ విద్యార్థుల ప్రతిభ

ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ

ఖమ్మం ఎడ్యుకేషన్, మే 30 : నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాలకు చెందిన విద్యార్థులు టీసీఎస్ సంస్థ నిర్వహించిన జాతీయస్థాయి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చినట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. నేషనల్ క్వాలిఫైర్ టెస్ట్ పేరుతో నిర్వహించిన పరీక్షకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈ విద్యాసంవత్సరంలో ఇప్పటికే 430 పైచిలుకు ఉద్యోగాలను తమ విద్యార్థులకు అందించామన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను కరస్పాండెంట్ డాక్టర్ జి.ధాత్రి, ప్రిన్సిపాల్ రాజుకుమార్, అధ్యాపకులు అభినందించారు.

కిరాణం షాపుల్లో 'అంగన్‌వాడీ గుడ్లు'

ఒక్కో గుడ్డును రూ.7కు అమ్మకం

కిరాణంషాపులో విక్రయించిన అంగన్‌వాడీ గుడ్లు

రఘునాథపాలెం, మే 30 : ప్రభుత్వం పేదల కోసం ప్రవేశపెడుతున్న పథకాలు పక్కదారి పడుతున్నాయి. ఖమ్మంఅర్బన్ పాండురంగాపురంలోని ఓ కిరాణం షాపులో అంగన్‌వాడీ ముద్ర వేసి గుడ్లను బహిరంగంగా విక్రయించడం చర్చనీయాంశమైంది. సదరు షాపు యజమాని ఒక్కో కోడిగుడ్డును రూ.7లకు విక్రయిస్తున్నారు. కిరాణం షాపులో అంగన్‌వాడీ గుడ్లు విక్రయింపై ఖమ్మం అర్బన్ ప్రాజెక్టు పరిధి బల్లేపల్లి సెక్టార్ సూపర్‌వైజర్ చెరుకూరి నాగమణిని వివరణ కోరగా విచారణ చేపట్టి చర్యలు చేపడుతామన్నారు.

'బ్లూమింగ్‌మైండ్స్'లో శిక్షణ శిబిరం ప్రారంభం

ఎన్‌సీసీ శిక్షణ అందిస్తున్న కర్నల్ నవీన్‌యాదవ్

రఘునాథపాలెం, మే 30 : ఖమ్మం నగరం బల్లేపల్లిలోని బ్లూమింగ్ మైండ్స్ సెంట్రల్ స్కూల్‌లో ఎన్‌సీసీ వార్షిక శిక్షణ శిబిరం-2 గురువారం ప్రారంభమైంది. సైనిక ఉన్నతాధికారులు కర్నల్ యాదవ్, కర్నల్ కేఆర్ రెడ్డిలో హాజరైన ఈ శిబిరంలో సుమారు 500 మంది ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు. సైనిక నియమావళి, సమాజ జీవనం, ఆరోగ్యం-పరిశుభ్రత, విపత్తుల నిర్వహణ, సైబర్ నేరాలు, రోడుడ భద్రత, నాయకత్వ లక్షణాలు వంటి వాటిపై వివరించారు. కరస్పాండెంట్ పీ అశోక్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వీ కిరణ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

చింతకాని: మాట్లాడుతున్న మధిర ఏడీఏ వెంకటేశ్వరరావు, సత్తుపల్లి: మాట్లాడుతున్న ఏడీఏ నర్సింహారావు, కూసుమంచి: విత్తన దుకాణాన్ని తనిఖీ చేసిన ఏవో వాణి

చింతకాని, మే 30: విత్తన డీలర్లు నకిలీ విత్తనాలను అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని మధిర ఏడీఏ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. మండలంలోని నాగులవంచ గ్రామంలో ఆయన గురువారం ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల దుకాణాల డీలర్లతో సమావేశమయ్యారు. స్టాక్ రిజిస్టర్, విత్తణ ప్యాకెట్ల నాణ్యత, గడువు తేదీ తదితరాలను దుకాణాదారులు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రతి ఎరువుల దుకాణం ముందు స్టాక్ బోర్డు, దరల పట్టిక ఉంచాలని చెప్పారు. రైతులకు విధిగా రసీదులు ఇవ్వాలన్నారు. వీటిపై కొనుగోలుదారు సంతకం తప్పనిసరిగా ఉండాలన్నారు. ఎమ్మార్పీ ధరలకే రైతులకు కాంప్లెక్స్, యూరియా వంటి ఎరువులను అందించాలని చెప్పారు. నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని, షాపు లైసన్స్ సైతం రద్దు చేస్తామని హెచ్చరించారు. లూజుగా ఉన్న సంచులలో ఉన్న విత్తనాలను అమ్మకూడదని చెప్పారు. ఏవో పల్లెల నాగయ్య, ఎస్సై షేక్ నాగుల్‌మీరా, ఏఈవోలు రాము, హరికృష్ణ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మొద్దు

సత్తుపల్లి, మే 30: నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సత్తుపల్లి వ్యవ

బోనకల్లు: వినతిపత్రం ఇస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు

సాయ సహాయ సంచాలకుడు యు.నర్సింహారావు హెచ్చరించారు. మండలంలోని కొత్తూరు రైతు వేదికలో ఆయన గురువారం విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణాల డీలర్లతో సమావేశమయ్యారు. విత్తన డీలర్లు రిజిస్టర్లను నిర్వహించాలని, క్రయ-విక్రయ నివేదికలను ఎప్పటికప్పుడు వ్యవసాయ శాఖ కార్యాలయంలో సమర్పించాలని చెప్పారు. ఇన్ వాయిస్‌లు,, బిల్లులు లేకుండా ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను నిల్వ ఉంచినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దుకాణం పేరు, డోర్ నంబర్లు స్పష్టంగా కనిపించాలన్నారు. సీఐ కిరణ్, ఏవో వై.శ్రీనివాసరావు, ఏఈవో నరేష్ పాల్గొన్నారు.

అధిక రేట్లకు విక్రయిస్తే ఊరుకోం..

కూసుమంచి,మే 30: ఎరువులు, పురుగు మందులను అధిక ధరలకు విక్రయిస్తే ఊరుకునేది లేదని, చర్యలు ఉంటాని వ్యవసాయ శాఖ అధికారి ఆర్ వాణి హెచ్చరించారు. మండలంలోని కోక్యాతండా,చౌటపల్లి, పాలేరులోని విత్తన, ఎరువులు, పురుగు మందుల దుకాణాలను గురువారం తనిఖీ చేశారు. తప్పనిసరిగా రిజిస్టర్లు నిర్వహించాలన్నారు.

అందుబాటులో జీలుగు విత్తనాలు

మధిర, మే 30: జీలుగు విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచినట్లు మధిర వ్యవసాయాధికారి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ఇప్పటివరకు 1200 క్వింటాళ్ల జీలుగు విత్తనాలను ప్రభుత్వం సరఫరా చేసినట్లు పేర్కొన్నారు.

సకాలంలో విత్తనాలు ఇవ్వాలని వినతి

బోనకల్లు, మే 30: రైతులకు సకాలంలో నాణ్యమైన విత్తనాలను సబ్సిడీపై ఇవ్వాలని కోరుతూ మండల వ్యవసాయాధికారి సరితకు సీపీఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ నాయకులు గురువారం వినతిపత్రం ఇచ్చారు. ఎం.గిరి, పెద్దపోలు వెంకటేశ్వర్లు, జక్కా మోహన్‌రావు, పులుసు రవి, సీహెచ్ వీరబాబు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

చెక్కు ఇస్తున్న నాయకులు

కూసుమంచి (నేలకొండపల్లి), మే 30: నేలకొండపల్లి మండలం రాజేశ్వరపురంలో బీఆర్ఎస్ క్రియాశీల కార్యకర్త ఆకుతోట ఉమామహేశ్వరరావు ఇటీవల మృతిచెందారు. ఆయనకు పార్టీ నాయకులు గురువారం రూ,2 లక్షల బీమా చెక్కును అందజేశారు. జటారి చంద్రమ్మ, రంగయ్య, సంపత్, కిరణ్, యేసు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడికి నివాళి

నరేంద్ర చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, నాయకులు

బోనకల్లు, మే 30: మండలంలోని కలకోట గ్రామ బీఆర్ఎస్ నాయకుడు చావా నరేంద్ర ఇటీవల మృతిచెందారు. ఆయన కుటుంబాన్ని గురువారం జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు పరామర్శించారు. నరేంద్ర చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. నివాళి అర్పించిన వారిలో చావా హనుమంతరావు, బాబు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జీవాలకు టీకాలు

బోనకల్లు, మే 30: మండలంలోని చొప్పకట్ల పాలెం, గోవిందాపురం-ఎల్ గ్రామాల్లోని జీవాల(గొర్రెలు, మేకలు)లకు పశు వైద్యాధికారి డాక్టర్ అన్వేష్ ఆధ్వర్యంలో సిబ్బంది గురువారం చిటికవ్యాధి నివారణ టీకాలు వేశారు. వర్షాకాలానికి ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గొర్రె పిల్లల సంరక్షణ మెలుకువలు, టీకాల ప్రాధాన్యం తదితరాంశాలపై పెంపకందారులకు అవగాహన కల్పించారు. సిబ్బంది నాగేంద్రకుమార్, చిన్నయ్య, శ్రీకాంత్, ప్రవీణ్, త్రివేణి పాల్గొన్నారు.

యువకుడు మృతి

మామిళ్లగూడెం, మే 30 : తాగిన మైకంలో కిటికి అద్దాలను చేతితో కొట్టిన యువకుడికి తీవ్ర రక్తస్రావమై మృతిచెందిన ఘటన గురువారం ఖమ్మం నగరంలో చోటుచేసుకుంది. ఖమ్మం వన్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన అమిత్‌కుమార్(27) కొంతకాలంగా ఖమ్మం నగరంలోని కమాన్‌బజార్‌లో నివాసం ఉంటూ పచ్చబొట్లు వేసే దుకాణంలో పని చేస్తున్నాడు. మద్యానికి బానిసైన అమిత్ బుధవారం రాత్రి అతిగా మద్యం సేవించి గదిలోని కిటికీ అద్దాలను చేత్తో బలంగా కొట్టాడు. దీంతో కుడిచేతికి తీవ్రగాయమై రక్తం పోవడంతో మృతిచెందాడు. నిద్రలో ఉన్న స్నేహితుడు గమనించకపోవడంతో గురువారం ఉదయం చూడగా అప్పటికే మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మేరీ మాత విగ్రహం ఆవిష్కరణ

మేరీ మాత విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ సలిగి ప్రకాశ్, ఫాదర్ ఆంథోని, క్రైస్తవుల శోభాయాత్ర

కూసుమంచి, మే 30: ప్రపంచానికి యేసు ప్రభువు చూపిన మార్గం ఆదర్శనీయమని, విశ్వ మానవాళికి శాంతి సందేశాన్ని అందించారని ఖమ్మం బిషప్ డాక్టర్ సలిగి ప్రకాశ్ అన్నారు. కూసుమంచి మండలం పాలేరులోని బాల యేసు ప్రార్థనా మందిరం 25 సంవత్సరాల ఆవిర్భావ వేడుక సందర్భంగా 76 అడుగుల ఎత్తున్న మేరీ మాత విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించారు. పాలేరు విచారణ గురువు కొమ్ము ఆంథోని ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బిషప్ మాట్లాడుతూ.. అందరినీ సన్మార్గంలో నడిపించే యేసు బోధనలు ఆచరణీయమని అన్నారు. పాలేరులో జరిగిన శోభాయాత్రకు క్రైస్తవులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో బిషప్‌లు ప్రకాష్, కరణం ధమన్, డాక్టర్ ఉడుముల బాల, మైపన్ పాల్, సిస్టర్ బీజీ జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సమస్యలు లేకుండా చర్యలు

కలెక్టర్ వీపీ గౌతమ్

వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న కలెక్టర్

మామిళ్లగూడెం, మే 30 : జిల్లాలో రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా వ్యవసాయ అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ వీపీ గౌతమ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయశాఖ అధికారులు, పీఏసీఎస్ సీఈవోతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీఏసీఎస్‌లకు కేటాయించిన విత్తనాలు విత్తన విక్రయ కేంద్రాల ద్వారా వెంటవెంటనే అమ్మకాలు చేయాలన్నారు. వ్యవసాయ అధికారులు కూపన్లు జారీచేశాక విక్రయ ప్రక్రియ ఆపకూడదన్నారు. సరఫరా చేసిన విత్తనాలను అమ్మకం చేస్తే, తిరిగి ప్రభుత్వం నుంచి విత్తనాల సరఫరా జరుగుతుందని తెలిపారు. విత్తన విక్రయ కేంద్రాల్లో స్టాఫ్ పెంచాలని, అమ్మకం ఆలస్యం చేస్తే, క్యూ లైన్లు పెరిగి సమస్యలు వస్తాయన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులు విత్తన విక్రయ కేంద్రాల వద్ద ఉండాలన్నారు. పచ్చిరొట్టె, పత్తి విత్తనాలకు జిల్లాలో ఎలాంటి కొరత లేదన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల, వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు సరిత, శ్రీనివాస రెడ్డి, ఏవోలు రాజు, ఛాయా, అధికారులు పాల్గొన్నారు.

'ఎన్నికల కోడ్' ఉన్నందున..

నిరాడంబరంగా అవతరణ ఉత్సవాలు: ఏసీ

అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్

మామిళ్లగూడెం, మే 30: జూన్ 2న తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని నిరాడంబరంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ సూచించారు. ఆవిర్భావ దినోత్సవ ఏర్పాట్లపై వివిధ శాఖల జిల్లా అధికారులతో కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను నిరాడంబరంగా నిర్వహించుకోవాలని సూచించారు. ప్రజాప్రతినిధులు పాల్గొనే కార్యక్రమాల్లో ఎలాంటి రాజకీయ ప్రసంగాలు లేకుండా తమ తమ కార్యాలయాల వద్ద నిర్వహించుకోవాలని తెలిపారు. జిల్లాలోని అన్ని కార్యాలయాల్లో ఉదయం 8 గంటల 15 నిమిషాలకు పతాకావిష్కరణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఉదయం అమరవీరుల స్తూపం వద్ద నివాళులు, తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు, అనంతరం కలెక్టరేట్‌లో పతాకావిష్కరణలు ఉంటాయని వివరించారు. జిల్లా అధికారులు, సిబ్బందితో సహా కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. తెలంగాణ ఉద్యమకారులను స్మరించుకోవడం, వారి తల్లిదండ్రులను సన్మానించడం చేయాలన్నారు. కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని సూచించారు. జిల్లాలో తెలంగాణ స్ఫూర్తిని ప్రతిబింబించే హోర్డింగులు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. జూన్ 2 సాయంత్రం లకారం బండ్ వద్ద ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించాలన్నారు. డీఆర్‌వో రాజేశ్వరి, అధికారులు పాల్గొన్నారు.

'పాలెం'లో కలెక్టర్ ఆకస్మిక పర్యటన

రఘునాథపాలెం సొసైటీని తనిఖీ చేస్తున్న కలెక్టర్ వీపీ గౌతమ్

రఘునాథపాలెం, మే 30 : మండల కేంద్రం రఘునాథపాలెంలో కలెక్టర్ వీపీ గౌతమ్ గురువారం ఆకస్మిక పర్యటన చేపట్టారు. గ్రామ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని సందర్శించి పచ్చిరొట్ట పైరు విత్తనాల పంపిణీని సమీక్షించారు. అనంతరం జై కిసాన్ పెస్టిసైడ్ దుకాణాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం రఘునాథపాలెంలోని భూసార పరీక్ష కేంద్రంలో విత్తన మొలకశాతం పరీక్ష విధానాన్ని పర్యవేక్షించారు. జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల, ఖమ్మం డివిజన్ సహాయ వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, ఏవో ఇంటూరి భాస్కర్‌రావు పాల్గొన్నారు.

రమణగుట్టలో అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల పరిశీలన

పాఠశాలల పనులను పరిశీలిస్తున్న కమిషనర్ సురభి

ఖమ్మం, మే 30 : అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల పురోగతిని మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి గురువారం తనిఖీ చేశారు. రమణగుట్టలోని ప్రభుత్వ పాఠశాలను పరిశీలిస్తూ పాఠశాలకు అమ్మ ఆదర్శ పాఠశాల పనుల కింద మంజూరు నిధులు, చేపట్టిన పనులు, పూర్తి చేసిన పనులు, ఇంకనూ చేయాల్సిన పనులు, పూర్తి కావడానికి కావాల్సిన సమయం అడిగి తెలుసుకున్నారు. అన్ని పాఠశాలల్లో బడిబాట కార్యక్రమాన్ని చేపట్టి, విద్యార్థుల నమోదులు పెరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పూడుకపోయిన కాలువలను తక్షణమే శుభ్రం చేయాలి

ఖమ్మం మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి

నగరంలోని పలు డివిజన్‌లలో శానిటేషన్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ ఆదర్శ్ సురభి

ఖమ్మం, మే 30 : ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని కాలువలను శుభ్రంచేసి వానకాలంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టాలని ఖమ్మం మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. గురువారం నగరంలోని 4, 7, 30, 35, 49, 54 డివిజన్‌లలో కమిషనర్ పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. చెత్తచెదారం కాలువల్లో వేసేవారిపై జరిమానా వేయాలని సూచించారు. పార్కులను శుభ్రంగా ఉంచాలని సూచించారు.

బియ్యం తరలిస్తున్న డీసీఎం బోల్తా

వ్యాన్‌లోని బియ్యాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

బోనకల్లు, మే 30: బియ్యం తరలిస్తున్న డీసీఎం వ్యాన్ బోల్తా పడింది. రేషన్ బియ్యాన్నే రీసైక్లింగ్ చేసి తరలిస్తున్నారన్న అనుమానంతో ఆ వ్యాన్‌ను మధిర సివిల్ సప్లై కార్యాలయానికి తహసీల్దార్ పున్నం చందర్ తరలించారు. 25 క్వింటాళ్ల బియ్యం లోడ్‌తో సూర్యాపేట నుంచి మధిరకు వెళ్తున్న ఈ వ్యాన్, గురువారం తెల్లవారుజామున బోనకల్లు-మధిర క్రాస్ రోడ్డు సమీపంలో బోల్తా పడింది. స్థానికులు రెవెన్యూ అధికారులకు, పోలీసులకు సమాచారమిచ్చారు. బియ్యం తరలింపునకు సంబంధించిన బిల్లులేవీ డ్రైవర్ వద్ద లేవు. దీంతో ఆ బియ్యాన్ని తహసీల్దార్ పరిశీలించి, రేషన్ బియ్యాన్నే రీసైక్లింగ్ చేసినట్లు గుర్తించారు. మధిరలోని సివిల్ సప్లై అధికారులకు ఈ విషయం చెప్పారు. ఆ తర్వాత, వ్యాన్‌ను మధిర సివిల్ సప్లై కార్యాలయానికి తరలించారు. ఆ తర్వాత, బియ్యానికి సంబంధించిన బిల్లులు ఉన్నాయంటూ తహసీల్దార్ వద్దకు డ్రైవర్ వచ్చాడు. పూర్తి విచారణ అవసరమని తహసీల్దార్ బదులిచ్చారు.

పల్లె ప్రకృతి వనాల పరిశీలన

మధిర, మే 30: మండలంలోని మాటూరు, మాటూరుపేట, నాగవరప్పాడు, సిద్ధినేనిగూడెం, సైదుపల్లిపురం గ్రామాల్లోగల పల్లె ప్రకృతి వనాలను మండల పంచాయతీ అధికారి టీవీఎల్ఎల్ శాస్త్రి గురువారం పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

తలసేమియా చిన్నారులు ఆదర్శవంతంగా ఎదగాలి

తలసేమియా పిల్లలతో డాక్టర్ రాజేష్ గార్గె

ఖమ్మం సిటీ, మే 30 : సమాజంలో ఎదిగేందుకు తలసేమియా చిన్నారులు లక్ష్యాలను ఎంచుకొని, వాటిని అధిగమించి ఆదర్శవంతంగా ఎదగాలని సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు రాజేష్ గార్గె అన్నారు. గురువారం నగరంలోని రితన్య వైద్యశాలలో తలసేమియా డే కేర్ సెంటర్‌లో తలసేమియా చిన్నారులు, వారి తల్లితండ్రులతో సమావేశమయ్యారు. చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ డీ నారాయణమూర్తి, సంస్థ బాధ్యులు పీ రవిచందర్, పీ అనిత, పీ పావని, ఉదయ్‌బాస్కర్, ఎన్.ఉపేందర్ పాల్గొన్నారు.

చెరువు మట్టితో భూసారం పెరుగుదల

రైతులతో మాట్లాడుతున్న ఏవో బాలాజీ

కొణిజర్ల, మే 30: చెరువు మట్టితో భూసారం పెరుగుతుందని మండల వ్యవసాయాధికారి(ఏవో) బాలాజీ చెప్పారు. మండలంలోని పెద్దగోపతిలో చెరువు వద్ద గురువారం మట్టి తోలుకుంటున్న రైతులతో మాట్లాడారు. పొలాల్లో మోతాదుకు మించి రసాయనిక ఎరువులు వాడితే భూసారం పూర్తిగా దెబ్బతింటుందని, కార్బన్ శాతం తీవ్రంగా తగ్గుతుందని, వీటి కారణంగా పంట దిగుబడి పడిపోతుందని చెప్పారు. చెరువులోని మట్టి పైన మూడు అడుగుల వరకు మాత్రమే మనకు ఉపయోగపడే సూక్ష్మజీవులు, సేంద్రియ కార్బన్ ఉంటుందని వివరించారు. తొలకరి వర్షాలకు ముందే ఎకరాకు సుమారు 10 ట్రక్కుల మట్టిని తోలుకుంటే మంచిదని చెప్పారు.

అనుమతి లేని పాఠశాలలపై చర్యలకు వినతి

వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కొణిజర్ల, మే 30: అనుమతులు లేకుండా ఇంటర్నేషనల్ సిలబస్ పేరుతో ప్రచారం చేస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ నాయకులు గురువారం తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. కోట ప్రేమ్‌కుమార్, పుప్పాళ్ల నాగరాజు, రామిశెట్టి ఉపేందర్, సాయిమనోజ్ తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం

పెనుబల్లి, మే 30: సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని వీఎం.బంజర రింగ్ సెంటర్‌లో మండల కన్వీనర్ తాండ్ర రాజేశ్వరరావు గురువారం నిర్వహించారు. పతాకాన్ని నాయకురాలు మిట్టపల్లి నాగమణి ఆవిష్కరించారు. నాయకులు చలమాల విఠల్‌రావు, గాయం తిరుపతిరావు, టి.చిరంజీవి, మిద్దె స్వామి, భూక్యా రాములు, గుడిమెట్ల బాబు తదితరులు పాల్గొన్నారు.